ఈవోడ్డు, ఆవోడ్డు

శ్రీ మనోజ బసు

* బెంగాలీ కథకు అనువాదం *

ఇస్మాయిల్ ఇంటి వసారా వగైరాలు పాకిస్తాన్ లోకి, పెరడూ, గదులూ వగైరాలు హిందూస్తాన్ లోకి చీలిపోయాయి. దాంతో వసారాలో వున్న కుండీ, రోలూ మరోచోటికి మార్చి, దాన్నే నడవా చేసికొన్నాడు. ఈ మార్పూ చేర్పులతో ఇస్మాయిల్ పదారణాలా పాకిస్తానీయుడయ్యాడు. ఐతే మరోకంటికి తెలీకుండా ఓ రాత్రికి రాత్రి పెరటి గదిలో దాచివుంచిన డబ్బు ముంతల్ని తవ్వి తెచ్చి వసారాలో భద్రంగా పాతిపెట్టుకొన్నాడు.

రకరకాల వదంతులు బయలుదేరాయి. పట్నమంతా అల్లకల్లోలమైపోయింది. స్టేషన్నించి కదిలే ఏ రైలుని చూసినా ఈ గందరగోళమే కనిపిస్తుంది. జనం పిచ్చెత్తినట్లు వురుకులు పరుగులు పెడుతున్నారు. ఇస్మాయిల్ కొడుకు రంజాన్ స్కూల్లో చదువుకొనే కుర్రాడు. ఎవరో వాడితల బ్రద్దలు కొట్టేశారు. అందాకా వెళ్ళిందికొండ!

ఇంత బీభత్సంలో కూడా ఓ ఆశ్చర్యకరమైన విషయం జరిగింది.

మంజుల ఇస్మాయిల్ వాకిట్లో నిలబడి,దర్వాజా గుండా తొంగిచూసి "ఇంత పొద్దెక్కినా నువ్వింకా నిద్రపోతూనే వున్నావా దాదా? లే, లే! మంజుని, వొచ్చా" అని అన్నది.

మంజుల గొంతువిని ఇస్మాయిల్ వాకిట్లోకి వొచ్చాడు. తనని అదేపనిగా ఎగాదిగా చూస్తున్న ఇస్మాయిల్ తో "ఏఁ అలా చూస్తావేఁ దాదా? గుర్తు రాలేదా? హాఁ, అయిన వాళ్ళంతా నన్నింటొంచి తన్ని తగిలేశారు దాదా?" అన్నది మంజుల.

"ఎప్పుడొచ్చావ్ నువ్?" అనడిగాడు ఇస్మాయిల్. మంజుల తీవ్రంగా "ఎప్పుడొచ్చావని ఎగతాళిగా అడుగుతున్నావా? నీ ఉద్దేశ్యం తెలీకుండా వుంది దాదా!" అన్నది.

ఇస్మాయిల్ మాటాడలేదు. వెనక్కి తిరిగాడు. అతణ్ణి అనుసరించింది మంజుల.

"ఏఁ దాదా! ఇదివరకటిలాగా 'ఏఁ మంజులా, ఇన్నాళ్లు ఎక్కడ మాయమై పోయావ్. అతీపతీ లేదు. ఇప్పుడీ వల్లకాటి కెందుకొచ్చావ్?' అనడగలేదేఁ దాదా?" అన్నది మంజుల.

ఇస్మాయిల్ వ్యగ్రస్వరంతో "పట్నంలోలాగా మా పేటలో ఒకళ్ళ పీకలు ఒకళ్ళు కోసుకో లేదుగా, వల్లకాడని వాగుతున్నావేఁ?" అని అన్నాడు.

"ఇప్పుడే కాయత్ పాడే నించి వొస్తున్నా దాదా! ఒకళ్ళొకళ్ళు పొడుచుకు చావకపోతే ఒక్క మనిషన్నా కనిపించాడూ? వీళ్ళంతా ఏమైపోయినట్టు? ఇళ్లూ వాకిళ్లూ భావురు మంటున్నాయి." ఇలా చెబుతూంటే మంజుల కళ్లు చెమ్మగిల్లాయి. కళ్ళు తుడుచుకుని "నన్ను కాసేపు కూర్చోనిస్తావా దాదా?" అనడిగింది మంజుల లోగొంతుతో.

మంజుల గొంతువిని కామరాన్ తలుపులు తెరుచుకొని నడవాలోకి వచ్చింది.

"ఇవాళ ఇలా మాటాడుతున్నావేఁ మంజూ? నువుంటానికి మేడలూ మిద్దెలూ కావాలా? ఇల్లంటూ వుందిగా. ఇది ఆకాశంలో కెగిరిపోలేదుగా..." అన్నది కామరాన్.

"చూడు దీదీ! నేనేదో పరాయిదాన్నయినట్టుగా ఇందాకట్నించీ అదోరకంగా మాటాడుతున్నాడు దాదా! ఏఁమిటో మరి!" అన్నది మంజుల వొత్తి చెబుతూ.

"సర్లే, చెప్పులొదిలి లోపలికిరా. నావద్దకూచో. ఆయ ననుకొనేదేదో అనుకోనివ్, ఇష్టమైతే జవాబు చెప్పు. లేదంటే మెదలకుండా కూచో" అన్నది కామరాన్.

అనువాదకులు: శ్రీ అట్లూరి రామారావు

ఈ మాటలు వింటూ మంజుల సంతోషంతో పులకించింది.

"శవాలు దొర్లాడే యీ దేశంలో నువ్వొక్కతెవే బ్రతికివున్నావనిపిస్తుంది—దీదీ! కాని, దాదా తీరుతెన్నులు చూస్తూంటే మాత్రం గుండెలు ఝుల్ మంటున్నాయి." అన్నది మంజుల.

పిడికిలి బిగించి ఇస్మాయిల్ "మీా బుర్రలు పగలకొడితే...ఇక అంతటితో పీడ విరగడైపోతుంది." అని అరిచాడు.

చప్పున మంజుని కామరాన్ లోపలికి లాక్కుపోయింది. "చూడమ్మా! ఆయన మాటల్ని మరోలా అనుకోకు! రంజాన్ చావుతో ఆయనలా అయిపోయారు..." అని అన్నది కామరాన్.

కడుపులో చల్ల కదలకుండా కాలక్షేపం సాగిస్తున్న కాపరం ఇస్మాయిల్‌ది. తినడానికి, ఉండడానికి లోటులేదు. ఒక్కగాను ఒక్క కొడుకు రంజాన్. వాణ్ణి చదివించి పెద్దవాణ్ణి చెయ్యాలని తలిదండ్రుల ఆశ.

రంజాన్ పినతండ్రి ప్లీడరు. పట్నంలో వుంటున్నాడు. ఆ ఇంట్లో తింటూ చదువుకుంటున్నాడు రంజాన్. మతకలహాలు ప్రారంభమయ్యాక, ఆ కుర్రవాణ్ణి ఓ రోజున ఎవరో లాఠీతో తల బద్దలుకొట్టేశారు. రెండు నెలలు ఆస్పత్రిలో పడివున్నాడు. తర్వాత ఇస్మాయిల్ కొడుకుని తీసికొని ఇంటికి వొచ్చాడు. చురుకైనవాడు కావడంచేత రంజాన్‌కి వెంటనే స్కూల్లో నే ఉద్యోగంకూడా దొరికింది.

కాని, ఇటీవల రంజాన్ స్థితి మరీ అయోమయమైపోయింది. నోటమాట పెగిలేదికాదు. కళ్లు గుంటలు పడ్డాయి. నిర్దయా ప్రపంచాన్ని అర్థం చేసుకోలేక చూస్తున్నాడా అన్నట్టుండేవి రంజాన్ చూపులు.

ఉన్నట్టుండి రంజాన్ "అదిగో! అలా చూడండి ...మళ్లా వొస్తున్నారు!...అయ్‌బాబో, వాళ్ళని రానివ్వకండి" అంటూ వెర్రికేకలు పెట్టేవాడు. అలా అరుస్తూ కంగారుగా పరుగెత్తేవాడు. ఓరోజున అలాగే అరిచి పరుగెత్తడంలో డాబామీాదనుండి పడిపోయాడు. పాతగాయం మరింత పెద్దగాయం అయింది. రక్తధార కట్టలేదు. స్పృహతప్పింది. విపరీతమైన దాహం పుట్టింది. ఎన్ని గ్లాసులనీరు తాగినా అది కట్టలేదు. ప్రపంచంలో వున్న నదులూ సముద్రాలుకూడా అతని దాహాన్ని తీర్చలేవేమో ననిపించింది.

ఈ భయంకరస్థితి చూశాక తండ్రి ఇస్మాయిల్ మనస్సు క్రమం తప్పింది. నెత్తుటేర్లు పొంగి నెత్తిమీాద పొరలుతున్నట్టు భావించాడు.

అదీ కథ!

చాలకాలానికి మంజుల తిరిగి ఈ ఇంటికి ఈ స్థితిలో వొచ్చింది. మంజుల కామరాన్ పరస్పరం కన్నీటితో కౌగిలించుకొని కష్టసుఖాలు చెప్పుకున్నారు. మంచీ చెడ్డా మాటాడుకున్నారు.

చివరికి మంజు, "మా నాన్న ఎక్కడున్నాడో నీకు తెలుసా దీదీ?" అనడిగింది.

కామరాన్‌నోట మాట రాలేదు. కళ్లుమాత్రం నీళ్ళతో నిండిపోయాయి. మంజు ఆదుర్దాగా "ఆయన్ని కూడా చంపేశారా? చెప్పవూ?" అనడిగింది.

కామరాన్ నిట్టూర్చి; "లేదమ్మా, ఎవరూ ఆయన్ని చంపలేదమ్మా! ఆయనే మృత్యువుని వెతుక్కుంటూ తిరుగుతున్నాడు." అని అంది.

మంజుల "తన జన్మభూమిలోనే వుండి నిర్భయంగా బ్రతికే శక్తికూడా లేదా? పిరికితనంతో పారిపోయాడా?" అన్నది.

కామరాన్: "మంజూ! ఎవడూ కన్న వూరినీ, ఆస్తిపాస్తుల్నీ ఊరకే పారేసుకోరు. కాని, వీళ్ళంతా దొంగలలాగానే నడిరాత్రివేళ పారిపోవలసి వచ్చింది మరి" అన్నది.

ఒక నిశ్చయానికి వచ్చినటు ధీమాగా మంజు "దీదీ! నేను మాత్రం ఇక్కడే వుండడానికి నిర్ణయించుకున్నాను. కాని, ఎక్కడికి వెళ్ళను? దీదీ! నీ ఇంట్లో ఓ మనిషి తలదాచుకోడానికి చోటు దొరకదంటావా?" అనడిగింది.

సరిగ్గా ఆ సమయంలోనే ఇస్మాయిల్ దర్వాజా గుండా తొంగి చూశాడు. ఇప్పటిదాకా అతను వాళ్ళ మాటల్ని వింటూన్నాడు.

"మంజూ, పో! స్నానంచేసిరా. నీ మట్టుకు నువు కాస్త వేరే వుడకేసుకొని తిను. పాపం! నీకు రాత్రంతా తిండీ తిప్పలుండి వుండవు!" అన్నాడు కరుణార్ద్ర స్వరంతో ఇస్మాయిల్.

మంజు వొళ్లు విరుచుకొని లేస్తూ "నా మట్టుకు నేను వంటచేసుకోనా? నీవు వంటా గింటా చేయవా దీదీ?...మీానించి నన్ను దూరంగా నెట్టేస్తున్నారా?" అనడిగింది కామరాన్ను.

"పిచ్చితల్లీ! నువ్వెవాడో దురదృష్టవంతురాలి వయ్యావు. వితంతువి. మా చేతికూడు తింటే లోకం ఏమనుకుంటుందమ్మా!" అన్నది సందేహస్వరంతో కామరాన్.

మంజు మారు మాటాడకముందే ఇస్మాయిల్ చికాగ్గా "పెద్ద దొరసాని దిగిందని, ఈవిడగారికి వండి వార్చి తినిపించాలి కాబోలు! ఈ విడ తండ్రీ అంతే. నెత్తినెక్కి దిగేవాడు కాదు. ఆ గుణాలే అబ్బాయి అమ్మాయికిన్నీ......ఇదిగో, ఇప్పుడిది పాకిస్తాన్ తెలిసిందా? మునుపటిలాగా ఇక్కడ నీ పప్పులేం వుడకవ్!" ఇలా అరుచుకుంటూ ఇస్మాయిల్ మరి అక్కడ నిలబడలేదు. ఎకాయెకీ రంజాన్ గోరీ దగ్గరకి వెళ్ళిపోయాడు. వెదురుకొసలు గోరిమీదికి వొంగి వున్నై. ఉన్నట్టుండి రంజాన్ ఏడుస్తున్నట్టు ఇస్మాయిల్‌కి తోచింది. "నాకేం వన్నా వండెరూ? తిండి పెట్టరూ? పోనీ, మంచినీళ్ళయినా ఇవ్వరూ?...నన్ను మరిచి పోయారా?... నేనిలా ఆకలితో మాడిపోవలసిందేనా? నన్నిలా దూరంచేసి వదిలేస్తారా?"

ఆ పగలంతా రంజాన్ ఆక్రందన పదింబదిగా ఇస్మాయిల్ గుండెల్లో మార్మోగుతూనేవుంది. ఆ స్వరం అతన్ని వున్మత్తుణ్ణి చేస్తోంది. వెన్నంటి తిరుము తోంది. నలువేపులా చీకటి క్రమ్మింది. సముద్ర తరంగాలు కుమ్మినట్టు రంజాన్ ఆక్రందన స్వరం అతని గుండెల్ని కుమ్ముతోంది. కొంచెం ఎదిగి, చదువుకొనే వాడైనా రంజాన్ సహజంగానే చంటిపిల్లవాడిలా ఏడుస్తూండేవాడు. అదేస్వరం ఇప్పుడున్నూ.

వడవాలో చాపమీద పడుకున్న ఇస్మాయిల్‌కి నిద్రపట్టక తెగ దొర్లాడు. కాసేపటికి లేచి కూచున్నాడు. ఏదో భయం అతన్ని ఆవరించినట్టయింది. ఒంటరిగా అలా కూచోలేక పోయాడు. కావలసిన డబ్బు పాతర వుంది. "దానికీ నాకూ ఏంవిటి" అని అనుకుంటూనే పాతర పెళ్ళగించాడు. ముంత చేతి కందింది. చీకట్లోనే ముంత నిండుగావున్న నాణాల్ని చేత్తో తడిమి చూశాడు.

ఈ డబ్బుతో ఆ వూళ్ళో ఒక చెరువు త్రవ్వించాలని ఇస్మాయిల్ జీవితాశయం. పంచాయతీ ప్రసిడెంటుతో ఈ విషయం చెప్పాడుకూడా. ఏదో ఒక రోజున తన సంపాదన మొత్తం పంచాయతీకి అప్ప చెప్పాలని నిశ్చయించుకున్నాడు. దాంతో బ్రహ్మాండమైన చెరువు ఏర్పడుతుంది. ఇంటిముందు ఇపుడు కనిపించే మామిడితోపూ, మిట్ట పల్లాలు, చెట్టూ చేమా, గట్టూ పుట్టా, తోటలూ దొడ్లూ అన్నీ ఏకాండమైపోయి చెరువుగా మారతాయి. నిండుగా కెరటాలు వొడ్డుల్ని వొరిసి తెపకలు కడతాయి. ఈ ఊహ రాగానే ఇస్మాయిల్ తపలోతాను,—

"యాఖుదా! బిడ్డ రంజాన్ పేర ఈ చెరువు తవ్వించగలిగితే నా బ్రతుకు తెల్లవారుతుంది. గోరీలో నిద్రించే నా బిడ్డ దప్పి అయినా తీరుతుంది." అని దీనంగా గొణుక్కునేవాడు.

మంజులవచ్చి వారం గడిచింది. ఊళ్ళో ఎక్కడ చూసినా, విన్నా, ఇస్మాయిల్ పేరెత్తి "ఛీ, ఛీ! థూథూ!!" అనేవాళ్ళే.

"యదురాయ్ కూతురు మళ్ళా ఈ వూరెందుకు వచ్చినట్టు?"

"ఇస్మాయిల్ అంటే సర్దార్ బిడ్డకదూ. మచ్చిక చేసుకుని పిల్లని ఇంట్లో అట్టి పెట్టేశాడు. ఏదో వొకపూట 'కల్మా' చదివి, ఆపని కాస్తా పూర్తి చేసేస్తాడు. ("కల్మా" అంటే మహమ్మదీయుల వివాహతంత్రానికి సంబంధించినతంతు.)

ఈ మాటలు ఊళ్ళోవాళ్లు బాహాటంగానే అంటూ వచ్చారు. పంచాయతీ ప్రసిడెంటు తాలూకు మనుష్యులు "ఆ పిల్లని పెళ్ళాడి ఇంట్లో వుంచుకోడానికి ప్రసిడెంటు అంగీకరించాడు." అని కూడా పుకార్లు లేవదీశారు.

ఎవరెన్ని అన్నా ఇస్మాయిల్ కిమ్మన్నాస్తిగా వూరుకునేవాడు.

మరికొందరు ముఖాన్నే "నీకొడుకు ఎలా చచ్చాడో, మరిచేపోయావా? ఇంకా చనిచచ్చి వూరుకుంటావా?" అని రెచ్చగొట్టేవారు.

ఇవేవీ ఇస్మాయిల్‌ని కదిలించేవి కావు. చాలా కాలంక్రితం జరిగిన ఓ దృశ్యం ఇప్పటికీ కళ్లకట్టినట్టుండేది.

తల్లిలేని ఓపిల్ల,ఓనాటి మధ్యాహ్నం ఏడుస్తూ కామరాన్ వొళ్ళో వొదిగిపోయింది. కాని ఏడ్పు మానలేదు. కామరాన్‌కూడ ఆ ఏడ్పుని ఆపలేకపోయింది. ఆపళాన తానే ఆపిల్లని భుజాలమీదికి ఎక్కించుకొని స్టేషన్‌వేపు తిరుణాల జరుగుతుంటే అక్కడికి తీసుకుపోయాడు. అక్కడ గిరగిర తిరుగు

తూన్న రంగులరాట్నం చూసేసరికి ఏడుపుమాని కిలకిల నవ్విందాపిల్ల. ఆపిల్లే ఈ మంజుల! ఆదృశ్యమే ఈ నాటికీ ఇస్మాయిల్ కళ్ళల్లో మెదుల్తోంది!

"ముసలి ప్రెసిడెంటుకి ఆ పిల్లని ముడెట్టేసెయ్. పడుచుపిల్లని ముసలాడు బాగానే సాకుతాడు!" ఇలా అడిగారు ఇస్మాయిల్ ని కొందరు!

కామరాన్ వంటింట్లో కూచుంది. ఇంటిముందు అయిదారుగురు మోతుబర్లుకూచుని ఆకూ వక్కలూ నములుతూ ఊసులాడుతున్నారు. గుసగుసలు చెప్పుకొంటున్నారు. అటూ ఇటూ చూస్తున్నారు. ఇదంతా ఏదో అపశకునంలా కామరాన్ భావించింది. చటుక్కున లేచి మంజులకోసం వెతికింది. "ఈ పిచ్చిపిల్ల ఎక్కడికిపోయిందో ఏమో?" అంటూ గొణిగింది... "అరే! సామాన్లగదిలోపడి నిద్రపోతోంది! హుఁ! నిశ్చింతగా నిద్రపోతోంది మహారాణీలాగా ..." కామరాన్ కోపంతో కంపించిపోయింది. రాత్రి తెల్లవార్లూ అలా అగ్గిలో గుగ్గిలంలాగా గడిపింది.

నిద్రనించి లేవగానే మంజులతో "ఓపక్క కొంపలంటుకుంటున్నై! నువ్వేమో తింటావ్, పడివుంటావ్. వీల్లేదు. వెళ్ళిపో! ఇప్పుడే వెళ్ళిపో!!" అంది కామరాన్.

కాని, మంజుకి చీమ కుట్టినట్టుకూడా లేదు. ఇదంతా నవ్వుతాల కిందకట్టి పకపక నవ్వింది.

కసురుతూ కామరాన్ "ఏమాటా చెప్పవేఁ?"

"నావాళ్లని వొదిలిపెట్టి నే నెక్కడికి పోను" అన్నది అలవోకగా మంజు.

కామరాన్ ముఖం చిట్లించింది. నీవాళ్ళెవరు? ఎవళ్ళభయం లేదా నీకు? కాయస్థపాడా అంతా ఖాళీచేసి వెళ్ళిపోయారు. నువ్విక్కడికి మళ్ళీ ఎన్నిగుండెల్తో వొచ్చావ్?" అనడిగింది. కామరాన్.

మంజు మామూలుధోరణిలో "దీదీ! మా అమ్మ చనిపోయినప్పుడు కాయస్థపాడా ప్రజలందరూ లేరా? అప్పు డెన్నిగుండెల్తోవొచ్చానో చెప్పుదీదీ!" అన్నది.

ఈ ప్రశ్నకు కామరాన్ వద్ద జవాబు ఏముంది? లేదు. కాబట్టే మారుమాట లేకుండా కామరాన్ వెళిపోయింది. ఇరుగుపొరుగువాళ్ళతో ఇంట్లో అంతో ఆమెకు విరుపు మాటలు తప్పలేదు.

"ఇదంతా నా నెత్తిన వొచ్చిపడింది. మీరు వన్నంటారు. ఆ పిల్లని వెళ్లిపొమ్మన్నా పోదాయె. నే నేం చెయ్యనుమరి?" అనేది కామరాన్.

"ఐతేమరి, కలమా చదివించి ఆ కాస్తా పూర్తి చెయ్యరాదూ?" అనేవాళ్లు ఇరుగు పొరుగు.

"దానివల్ల ఏ మవుతుందమ్మా! ఈ రోజుల్లో మతం బండరాయిలా తయారయింది. కలమా చదివించినంతమాత్రాన అది కరిగిపోయే రోజులు పోయాయి." అన్నది కామరాన్.

మర్నాటిసాయంత్రం, మంజు ముక్కలు తరిగిస్తోంటే, కామరాన్ వాటిని వేయించుతోంది. మంజు తనఇంట్లో గొడవలన్నీ చెబుతూ, వొదినలూ, ఆడబిడ్డలూ అందరూ తనని ఎలా వేధించి వెళ్లగొట్టిందీ వివరించింది. "దీదీ! ఆ సమయంలో మీరు తప్ప మరోదిక్కు నాకు కనిపించనే లేదు!" అంది మంజు.

సరిగ్గా ఆ సమయంలోనే వాకిట్లో కలకలం వినిపించింది. కామరాన్ "మళ్లావచ్చి చచ్చారు కాబోలు" అనుకుంటో లేచివెళ్లి తొంగిచూచింది. ఆమె అనుమానమే నిజమైంది. వూళ్లో మోతుబర్లు ఇంటిముందున్నారు.

కామరాన్ మంజులమీద మండిపడుతూ "దిక్కు ఇక్కడా లేదు. నీ దారి నువు చూసుకో! వెళ్లకపోయావా చీపురుతో సింగారించి మరీ తగిలేస్తాను!" అన్నది.

మంజుల మధురంగా నవ్వుతూ "దీదీ! నీచేత్తో ఇప్పటిదాకా మిఠాయిమాత్రమే తింటూవచ్చాను. ఆ చీపురుదెబ్బలు ఎలా వుంటాయో రుచిచూస్తాను." అన్నది.

ఇదే సమయంలో ఇస్మాయిల్ చిలుము గొట్టంలో నిప్పు వేసుకోడానికి వొచ్చాడు. "చూడు దాదా! దీదీ కత్తిచూపి నన్ను గెంటేస్తోంది" అని మంజు ఇస్మాయిల్ కి ఫిర్యాదు చేసింది.

"ఆఁ! గెంటి తీరుతాను. మనమతాలు రెండయిపోయాయి. దేశం రెండు ముక్కలయింది. ఇక్కడ నువ్వే మొహంపెట్టుకొని వుంటావ్?" అని గర్జించింది కామరాన్,

మంజులకూడా కష్టంవేసింది. "ఎక్కడికి పొమ్మంటావో నువ్వే చెప్పుదీదీ? నా కెవళ్లున్నారు? ఎక్కడుంటాను? ఏం తినమంటావ్? నా గతేమిటి?

ఐనా నన్ను వెళ్లగొడతావన్నమాట! సరే...పోదాం పద దాదా! నే నెవళ్లనీ ఎరగను. నువ్వైనా కేదో దారిచూపించి రావాలిగా..." ఇలా అంటూనే వల వల ఏడ్చింది మంజుల.

ఇక ఆవేళ భోజనానికైనా ఇంటికిరాలేదు ఇస్మాయిల్. మునలి ప్రెసిడెంటు ఇంట్లో జరిగిన విందులో ఉన్నాడు.

అన్నంతపని చేసేదాకా నిద్రపోని మనిషి కామరాన్. చాటుమాటుగా వక్కలు, కొబ్బరికాయలు అమ్మి పదిరూపాయలు కూడబెట్టింది. అందులోనుంచి నాలుగైదు మంజుల చేతికిచ్చి, చీకటి పడకముందే స్టేషన్‌కి పంపించేసింది.

ముఖూ మొగం ఎరగని కలకత్తాకి టికెట్ తీసుకొని మంజుల రైలెక్కింది. బండికదిలింది.

ఇదే సమయంలో ఇస్మాయిల్ పరిగెత్తుకొచ్చి ఓ ముంతని కిటికీలోంచి మంజుల చేతికందించాడు. "మంజూ! దోవలో తినడానికి కొంచెం మిఠాయి తెచ్చానమ్మా!" అన్నాడు.

మంజుల ఏడ్చింది. 'దీన్ని నువ్వే తీసుకుపో దాదా! ఇంట్లోంచి వెళ్ళగొట్టి దిక్కులేకుండా చేశారు. దిక్కులేనిదానికి మిఠాయి పెడుతున్నారు. ఈ లేనిపోని మమకారం ఎందుకుదాదా?" అన్నది రుద్ధకంఠంతో.

కాని, దాదాకి ఈ మాటలు వినిపించే అవకాశం కలగలేదు. బండి పరుగెతుతోంది. మంజు కిటికీలోంచి తొంగిచూస్తోంది. ఫ్లాట్ పారంమీద ఇస్మాయిల్ ఒక రాతిబొమ్మలా నిల్చుండి పోయాడు.

మంజుల కూర్చున్న పెట్టెలోనే పరిచితవ్యక్తి విపిన్ తాంబూలీకూడా వున్నాడు. "ఇస్మాయిల్ సర్దార్ ఏమిటి ఇచ్చి వెళుతున్నాడు మంజూ?" అనడిగాడు.

"మిఠాయి" అంది మంజుల.

"ఛ! ఛ! దాన్ని ముట్టుకోకు! జరిగిందేదో జరిగిపోయింది. ఇక మిఠాయి గిఠాయి ముట్టుకోకు! వాళ్ళు అందులో విషంకలిపినా కలుపుతారు! ఆఁ, పారెయ్! ఆ ముంత అపాటునే పారెయ్!"అన్నాడు విపిన్ బాబు!

"అలాగే...హుఁ! వాళ్ల మనసులే మారిపోయాయి. వేరే విషంకూడా ఎందుకు? తిండే విషమై పోయుంటుంది." ఇలా అంటూనే మంజు ముంత వాసిన విప్పింది...మిఠాయిలేదు. కొంచెం వేపుడు ముక్కలు, నువ్వుల పూర్ణాలు వున్నాయి. వాటినెలా ముట్టుకుంటుంది?

కాని, ముంత బరువుగావుంది? అడుగున గల గల మంటున్నాయి? ఏమిటవి?...కాసులు! బంగారు కాసులు!! వాటిని చూస్తూనే మంజుల "దాదా, దారిలో తిండే కాకుండా, పరాయిచోట బ్రతకడానికి బంగారు కాసులిచ్చాడు." అని గొణిగింది.

రైలు వెళ్ళిపోయింది. ఫ్లాట్ ఫారంనిండా శూన్యం కమ్మింది. ఇస్మాయిల్ అలాగే, రాతిబొమ్మలాగానే నిలబడిపోయాడు. రైలు మలుపుతిరిగి కనుమరుగై పోయింది. దాంతోపాటే అతని ఏకైక జీవితాశయం కూడా దూరమైపోయింది. తన బంధువు కాదు, మతం కాదు. ఏమీకాని ఓపిల్ల తన సర్వస్వాన్ని తీసికొని వెళ్ళిపోయింది.

ఇక, తను ఊళ్ళో చెరువు తవ్వించలేదు. గోరీలోపలి చీకట్లో, ఎండిన గొంతెత్తి రంజాన్ ఆత్మ అనంతకాలం అలా "దాహం. దాహం!" అని ఆక్రోశిస్తూనే వుంటుంది!

వెదురు పొదలమీదుగా ఓ నక్షత్రం మిల మిల లాడుతోంది. నలువేపులనించి ధరిత్రినిండా సంధ్యాకాంతి అలముకుంటోంది. గాలికి ఊగిపోతున్న వెదురు ఆకులమీద నక్షత్రకాంతి "తుళుక్ తళుక్" మంటోంది. 'బంగారు నాణాల్ని ఇచ్చేసి ద్రోహినయ్యానా? కాని, కాని, మంజులకుమాత్రం ఎవరున్నారు? ఎలా బ్రతుకుతుంది? పాపం!' ఇలా అనుకుంటూ ఇస్మాయిల్ "యా అల్లా! యా రహిమాన్!! అపరాధినని నన్ను దండించకు. పాపం, ఆ మంజుల స్థితిగతులుకూడా చూడు.'అని వేడుకున్నాడు.

వెదురు పొదలమీది నక్షత్రం మరింత వెలుగుల్ని నింపింది. మైదానం దాటాక ఓ గాలితెర అతన్ని తాకింది. ఇటూ - అటూ రెండువేపులా వెలిగేదా ఒక్క నక్షత్రమే. గాలి, ఆ వేపునవున్న. అరటి తోటల్లో వీచి, మధురస్వరాల్ని సంతరించుకొని, ఈ వేపున వరిచేలని నిమురుతూ జోల పాడుతోంది!